క్లుప్తంగా

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: అమృత్ జల్ పరియోజన పథకం కింద కేంద్రం నిధులు మంజూరు చేయడంపై హర్షిస్తూ ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి శుక్రవారం బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు బెజ్జారపు లవన్‌కుమార్ నందీ కూడలి వద్ద క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి శ్రీనివాస్, బండారు లక్ష్మణ్, దొనకొండ నరేష్, గాజు భాస్కర్, దివిటి శ్రీధర్, గుండ రాజేశ్వర్, ప్రణీత్ పాల్గొన్నారు.

రోల్లవాగు కాల్వ బుంగ పూడ్చివేత



బుంగను మూస్తున్న కూలీలు

సారంగాపూర్: రోల్లవాగు ప్రాజెక్టు నుంచి దిగువన పంటలకు వెళ్లే ఆర్‌వీ మెయిన్ కాల్వ బుంగను పూడ్చే పనులను శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులు చేపట్టారు. బీర్‌పూర్ బస్టాండ్ సమీపంలో రోల్లవాగు ప్రాజెక్టు మెయిన్ కాల్వకు బుంగ పడడంతో నీరు వృథాగా పోతోంది. రోల్లవాగు ప్రాజెక్టు నుంచి బండరాళ్లను తీసుకువచ్చి తెట్టే అడ్డడంతో పాటు, పూర్వస్థితిలో ఉండేలా లైనింగ్ చేస్తామని, శనివారం పనులు పూర్తి అవుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల డీఈ చక్రూనాయక్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, ఏఈ అనిల్, సూపర్‌వైజర్ మోహన్, రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్స్‌కు క్రీడా పోటీలు



క్యారమ్స్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులకు శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి రోజు పీడీ గంగారాం ఆధ్వర్యంలో క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. ఆటల్లో రిటైర్డ్ ఉద్యోగులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. పోటీల సమన్వయ కర్తగా రిటైర్డ్ పీజీ హెచ్‌ఎంప్రభాకర్‌రావు వ్యవహరించారు.

డిపో ఆదాయం పెంపునకు సమష్టిగా కృషి చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌ఎం సుచరిత

మెట్‌పల్లి: డిపో ఆదాయం పెంపునకు సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని కరీంనగర్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సుచరిత సూచించారు. పట్టణంలోని డిపోను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లతో పాటు గ్యారేజీ సిబ్బందితో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. రీజియన్‌లో మొదటి స్థానంలో ఉన్న మెట్‌పల్లి డిపోను రాష్ట్రంలో కూడా అదే స్థానంలో నిలిచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ ఎం భూపతి, మేనేజర్ దేవరాజు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన

జగిత్యాలక్రైం: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలోని ఓ కుటుంబానికి చెందిన వారు తమపై అన్యాయంగా పోలీసులు కేసు పెట్టి జైలుకు పంపించారని శుక్రవారం ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాలు.. గుంజపడుగు గ్రామానికి చెందిన కల్యాణి, తిరుమలేశ్, అతడి సోదరుడు, తండ్రిపై అదే గ్రామానికి చెందినవారు దాడిచేశారని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, విచారణ చేస్తామని చెప్పి పోలీసులు ఇంటికి పంపించారని, తాము ఇంటికి వెళ్లగా ప్రత్యర్థి వర్గం వారు తమపై దాడిచేసి గాయపర్చారని పేర్కొన్నారు. కాగా, పోలీసులు దాడి చేసినవారిపై కేసు పెట్టకుండా తమ కుటుంబ సభ్యులపైనే కేసు పెట్టి జైలుకు పంపించారని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో శాంతించారు.

నాగుల పంచమి వేడుకలు



ధర్మపురిలో పూజలు చేస్తున్న మహిళలు



సారంగాపూర్‌లో మహిళల పూజలు



పొరండ్లలో పుట్టలో పాలుపోస్తున్న మహిళలు



కథలాపూర్‌లో..



పెగడపల్లిలో

జగిత్యాలరూరల్/ సారంగాపూర్/ ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/ మల్లాపూర్/ గొల్లపల్లి /ధర్మపురి: జిల్లా వ్యాప్తంగా నాగుల పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పుట్టల్లో పాలు పోసి తమ మొక్కులు చెల్లించుకున్నారు.





ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్, గొల్లపల్లిలో పూజలు చేస్తున్న మహిళలు

పార్టీకి యువజన విభాగం ఎంతో ప్రధానం



వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్, నాయకులు

జగిత్యాల: పార్టీకి యువజన విభాగం ఎంతో ప్రధానమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. లు రాజకీయ పార్టీకి బలోపేతం కావడానికి యువజన విభాగం ప్రధానమన్నారు. యువజన కాంగ్రెస్ జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీని నిలబెట్టేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్,మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

మల్యాల/కథలాపూర్/రాయికల్: కథలాపూర్, మల్యాల, రాయికల్ మండలాల్లో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సోనియాగాంధీ గుడి వద్ద యూత్ కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: అఖిల భారత యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు ధర్మపురి పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు.

కోరుట్ల రూరల్: పట్టణంలో అఖిల భారత యువజన కాంగ్రెస్ 64 వ ఆవిర్భావ దినోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ 64వ ఆవిర్భావ వేడుకలు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

నిరు పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

• ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



చెక్కులు పంపిణీ చేస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని ధర్మపురి ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నిషాంత్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయ భవనాలకు శంకుస్థాపన

బుగ్గారం: మండల కేంద్రంలో నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయానికి శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సంబంధిత స్థల దాత గూడూరి వీరరంగారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. బుగ్గారం హాస్టల్ విద్యార్థులకు శుక్రవారం పరుపులు,దిండ్లు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామ పెద్దలు యువకులు, పాల్గొన్నారు.

తాగు,సాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటలో జగిత్యాల నీలకంఠ రైతు ఉత్పత్తి దారుల కంపనీ లిమిటెడ్ సొసైటీని ప్రారంభించారు. అనంతరం అంతర్గాంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అంతర్గాం హనుమాన్ ఆలయం అభివృద్ధికి మంత్రి కొండా సురేఖను కలిసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒకే మొత్తంలో రూ.31 వేల కోట్ల రుణ మాఫీ అమలు చేస్తున్న ప్రభుత్వం మనదే అన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ శ్రీనివాస్, నాబార్డ్ డీడీఎం దిలీప్‌చంద్ర, శాస్త్రవేత్తలు రజినిదేవి, గోన్యనాయక్, ఏవో తిరుపతినాయక్, సొసైటీ చైర్మన్ దమ్మ గంగారెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లకు నిధులు మంజూరు చేయాలి

జగిత్యాల: పట్టణంలోని 25వ వార్డులో రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంతో కాలనీలో ఇబ్బందికరంగా మారిందని, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, నిధులు మంజూరు చేసి రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పొలాస గ్రామానికి చెందిన వెంకటేశ్‌కు రూ.23 వేల విలువ గల చెక్కు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ధరూర్‌లో మొక్కలు నాటుతున్న రఘువరన్



గుండంపల్లిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

జగిత్యాలరూరల్/మల్యాల/కథలాపూర్/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/పెగడపల్లి: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని జెడ్పీ డెప్యూటీ సీఈవో రఘువరన్ అన్నారు. శుక్రవారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు స్వచ్ఛదనం- పచ్చదనంలో పాల్గొని మొక్కలు నాటాలు, కార్యక్రమాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు, ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో ఒకరికి డెంగీ

సారంగాపూర్: మండల కేంద్రంలో ఒకరికి డెంగీ పాజిటివ్ రావడంతో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు రక్తనమూనాలను సేకరించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యసిబ్బంది ఇంటింటా అవగాహన కల్పించారు. ఎంపీవో శశికుమార్‌రెడ్డి, సెక్రటరీ ప్రేమలత, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.

ప్రభుత్వం తరఫున ఆదుకుంటాం

మెట్‌పల్లిరూరల్: పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై మృతి చెందిన విద్యార్థి అనిరుధ్ కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు. పాఠశాలలో జరిగిన సంఘటనపై విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వెంకటేశం దృష్టికి తీసుకెళ్లారు.ఇటీవల రెండు సార్లు ఇలాంటి ఘటనలు జరిగాయని, సిబ్బంది నిర్లక్ష్యంతో ఘటనలు జరుగుతున్నాయని వివరించారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని ఆయా గొండు గూడాల్లో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగేళ గొండు గూడెం, చిన్నకొల్వాయి, చిత్రవేణిగూడెం గ్రామాల్లో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా గిరిజన సంక్షేమాధికారి చిత్రు పటేల్ పాల్గొని మాట్లాడారు. మాట్లాడుతూజల్, జంగల్, జమీన్ నినాదంతో పేద గిరిజన గుండెల్లో పోరాట యోదులైన కొమురంభీమ, రాంజీగొండు చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, తుడుందెబ్బ రాష్ట్రప్రధాన కార్యదర్శి చిక్రం భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్:మండలంలోని సిరికొండలో ఆదివాసీ దినోత్సవంను శుక్రవారం ఆ కులసంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, ఆదివాసి సంఘం మండలాధ్యక్షుడు దివ్వి రాజు, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో కొమురం భీం విగ్రహం వద్ద శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షుడు మట్ట సంజీవ్ పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని కొమురంభీం చౌరస్తాలో ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, తహసీల్దార్ ఖయ్యూం, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో మారణకాండను అరికట్టాలి

గొల్లపల్లి: బంగ్లాదేశ్‌లో మైనార్టీ, హిందువులు, బౌద్ధులపై మారణకాండను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్- భజ్ రంగ్ దళ్ గొల్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గోరక్ష సహప్రముఖ్ ఆడేపు నరేశ్,మండల అధ్యక్షుడు, విశ్వహిందూ పరిషత్ మండల్ల అధ్యక్షుడు కుంభార్‌కార్ అరుణ్.బజ్ రంగ్ దళ్ మండల్ కన్వీనర్, ఎన గందులరమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గోదావరి వద్ద పోటెత్తిన భక్తులు



ఇబ్రహీంపట్నం: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా మండలంలోని ఎర్దండి గోదావరినది వద్ద భక్తులు పోటెత్తారు. వివిధ గ్రామాల నుంచి ఉదయమే తరలివచ్చి స్నానాలు ఆచరించారు. గంగామాతకు, శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

దోమలు, కప్పలు, పాముల బెడద



జగిత్యాల: మెట్‌పల్లి పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్ వద్ద పెద్ద మురికికాలువ తెగిపోయి కాలనీవాసుల నివాసాల ప్రాంతాలకు మురికినీరు అంతా వచ్చి చేరింది. దీంతో కాలనీలో అంతా దోమలు, పాములు, కప్పల బెడదతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికికాలువ మరమ్మతులు చేపట్టి మురికినీటిని తొలగించేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

నియామకం

కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ కార్యదర్శిగా వంశీధర్‌రావు

పెగడపల్లి:కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల కార్యదర్శిగా ఐల్నేని వంశీధర్‌రావు నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా చీఫ్ ఆర్గనైజర్ అందె మారుతి బాపూజీ వంశీధర్‌రావును నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. తన నియమకానికి సహకరించిన విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

మహిళపై దాడి..కేసు నమోదు

మల్యాల: మండలంలోని మ్యాడంపల్లిలో భూతగాద కేసులో దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు చేశారు. ఎస్సై నరేశ్ కుమార్ కథనం ప్రకారం మ్యాడంపల్లికి చెందిన చిర్ర రాయమల్లు కుటుంబానికి, వదిన అయిన చిర్ర మల్లవ్వ కుటుంబానికి కొంతకాలంగా భూ తగాదా నడుస్తోంది. శుక్రవారం చిర్ర మల్లవ్వ కూతురు పడిగెల బాబాయి మ్యాడంపల్లికి రాగా, భూమిని చిర్ర రాయమల్లు దున్నిస్తున్నాడని తెలుసుకొని, సంఘటనా స్థలానికి వెళ్లగా చిర్ర రాయమల్లు, కుమారుడు, భార్య బూతులు తిడుతూ దాడి చేశారు. దీంతో గాయాలు కాగా, బాధితురాలు పడిగెల బాబాయి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గొల్లపల్లి: మండలంలోని గుంజపడుగు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు శుక్రవారం పట్టుకుని సీజ్ చేశారు. మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన పస్తం కనుకయ్య, గంధం కనుకయ్య షెడ్డులో అక్రమంగా నిల్వ చేసని 105 బస్తాలు(సుమారు 78 క్వింటాళ్ల రేషన్ బియ్యంగా గుర్తించి సీజ్ చేశారు.6-ఏ కింద కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్,ఎన్‌ఫోర్స్ మెంట్ ఎస్పీ, సీఐ ప్రశాంత్ రావు, తహసీల్దార్ దినేష్ చంద్ర.ఎస్సై నారాయణ బాబు, సివిల్ సప్లై అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ధర్మపురి: మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన సర్ల లక్ష్మణ్ (35) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. శుక్రవారం అంతిమయాత్రలో పాల్గొని ఆయన మృత దేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి పార్టీ పక్షాన అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోటు బుక్‌లు పంపిణీ

ధర్మపురి: ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ వివాహ రజతోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం న్యూ హరిజన వాడ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే సతీమణి కాంతాకుమారి కేక్ కట్ చేసి విద్యార్థులకు నోటుబుక్కులను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి

మెట్‌పల్లి: విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి సూచించారు. పట్టణంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహంలో బాలికల కోసం అడిషనల్ కలెక్టర్ శనివారం సొంతంగా ఆట వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, ఆ దిశగా విద్యార్థులను అవసరమైన ప్రోత్సాహమందించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ మోహన్ ఉన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

ఇబ్రహీంపట్నం: గీత కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరి పరుశరామ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని డబ్బా గ్రామంలో మాట్లాడారు. మత్స్య కార్మికులకు ఇచ్చినట్లే గీత కార్మికులకు సబ్సిడీపై ద్విచక్రవాహనాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చెట్ల చంద్రశేఖర్ గౌడ్, మండలాధ్యక్షుడు నేరెళ్ల సుభాష్‌గౌడ్, మెట్‌పల్లి మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఎలుక అశోక్‌గౌడ్, నీరుల సత్యంగౌడ్, మెర్గం రాజన్న పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

రాయికల్: ఎన్‌ఈఈఆర్టీ సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్ ఆధ్వర్యంలో సందర్శించారు. 1వ తరగతి విద్యార్థులకు విద్యా ప్రవేశ్ అమలు స్థితి, పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల బోధన, మధ్యాహ్న భోజన అమలు తీరుపై పరిశీలించారు. హెచ్‌ఎం సతీశ్, ఉపాధ్యాయులు సాయికృష్ణ, సునీత, శృతి, కవిత పాల్గొన్నారు.

13న ప్రైవేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ

జగిత్యాల: నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 13న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంప్లాయీమెంట్ అధికారి సత్తమ్మ తెలిపారు. ఫ్లిప్‌కార్ట్‌లో 200 డెలివరీ ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, పదో తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీపీగేట్‌లో స్టేట్ 7వ ర్యాంక్

రాయికల్: ఉస్మానియా యూనివర్సిటీ శుక్రవారం ప్రకటించిన సీపీగేట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన పాతూరి సాత్వికరెడ్డి ఎంఎస్సీ స్టాటిస్టిక్స్‌లో స్టేట్ 7వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా సాత్వికరెడ్డిని పలువురు అభినందించారు.

ప్రజల కోసం త్యాగాలు చేసిన వ్యక్తి బుద్ధాదేవ్

జగిత్యాల: ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిన వ్యక్తి పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధాదేవ్ అని జిల్లా సీపీఐఎం కమిటీ నాయకులు అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు, పార్టీ, నమ్మిన సిద్ధాంతం కోసం బుద్ధాదేవ్ అనేక త్యాగాలు చేశారని, ఆయన మృత దేహాన్ని మెడికల్ కళాశాలకు డొనేట్ చేసి మరణంలో కూడా ఉదారత చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ.చౌదరి, వెంకటాచారి, గర్వందుల రమేశ్, మల్యాల సురేశ్, రజిత సుల్తానా, ఆవాజ్, అంగోత్ నరేశ్ పాల్గొన్నారు.

విద్యార్థుల పోస్టుకార్డు ఉద్యమం

ధర్మపురి: ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కోరుతూ విద్యార్థులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ధర్మపురిలోని శ్రీ చైతన్య, నవోదయ డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు పంపించారు. కళాశాలల్లో పరీక్షల ఫీజులు చెల్లించలేక ఎంతో మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని, ప్రభుత్వం తక్షణం స్పందించి ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు.